క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత

మార్కాపురం టౌన్: పట్టణంలోని 6వ సచివాలయ పరిధిలో మృతి చెందిన షేక్ లాడిల్ ఇస్మాయిల్ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన పది వేల రూపాయల నగదును ఆయన కుటుంబ సభ్యులకు సోమవారం 11వ బ్లాక్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్ అందించారు. ఆపదలో ఉన్న వారిని ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తర్లుపాడు: మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళ సమైఖ్య సభ్యులు, గ్రామ సంఘ వీఓఏలతో ఏపీఎం పిచ్చయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆజాదీకి అమృత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై కార్యక్రమం నిర్వహించారు. మండల సమైఖ్య అధ్యక్షురాలు సుభాషిణి, కార్యదర్శి రంగరత్నమ్మ, దిబ్బమ్మ, మరియమ్మ, శ్రీనిధి మేనేజర్ సూలోచన, ఎల్‌సి నాగభూషణం, సీసీ సాయిలు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ముండ్లమూరు: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సంపత్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని కొమ్మవరం, బొప్పూడివారిపాలెం, వేముల, ఈదర గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎక్కడా రాజకీయ పార్టీల పోస్టర్లు ఉండరాదన్నారు.

తొమ్మిది మందిపై కేసు

కొమరోలు: పొలంగట్టు విషయంలో దాడి నేపథ్యంలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుబ్బరాజు తెలిపారు. మండలంలోని ముత్రాసుపల్లికి చెందిన తుమ్మళ్ల గోపాల్ పొలం గట్టు వద్ద పందిళ్ల నాగరాజు రాళ్లు పాతుతుండగా తమ హద్దుల వద్ద రాళ్లు ఎందుకు పాతుతున్నారని గోపాల్ ప్రశ్నించగా నాగరాజు మరియు కుటుంబ సభ్యులు గోపాల్, కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారని ఎస్‌ఐ తెలిపారు. కర్రలు, రాళ్లు ఉపయోగించి దాడి చేయడంతో గోపాల్, రమాదేవి, సావిత్రికి గాయాలయ్యాయని, వారు గిద్దలూరు వైద్యశాలలో చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగరాజు, కుటుంబ సభ్యులైన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడి మృతి

దొనకొండ: స్థానిక సాదియా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు షేక్ అబ్దుల్ మజీద్ (50) సోమవారం తెల్లవారు జాము గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక వీవీపురంలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మజీద్ అనేక సేవా కార్యక్రమాలు చేసేవారు. అందరితో కలిసి మెలిసి ఉండే మజీద్ మృతి చెందటంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

మా భూములు మాకు ఇప్పించండి



ధర్నా చేస్తున్న దళితులు

పుల్లలచెరువు: సీలింగ్ చట్టం 1973 ద్వారా దళితులకు సక్రమించిన భూములను తమకే కావాలంటూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పుల్లలచెరువుకు చెందిన 40 మంది దళితులు ధర్నా నిర్వహించారు. పుల్లలచెరువు ఎస్సీ కాలనీకి చెందిన దళితులైన ఎల్. లింగయ్య, ఏసోబు, సామేలకు సీలింగ్ చట్టం ప్రకారం చౌటపల్లి ఇలాకాలో 30-2ఎ1,30-2ఎ2,30-2ఎ5 సర్వే నంబర్లలోని భూములను ప్రభుత్వం పట్టాలిచ్చింది. అప్పటి నుంచి ఆ రైతులు వివిధ రకాల పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూములకు చెందిన మేడికొండ సీతయ్య అనే రైతు కోర్టుకు వెళ్లడంతో అప్పటి జాయింట్ కలెక్టర్ సాగులో ఉన్నవి కాకుండా బీడు భూములను మాత్రమే తీసుకోవాలని సూచించారు. అదే విధంగా తీసుకుంటామని అంగీకారం తెలపడంతో సాగు చేయని భూమిని ఇవ్వాలని ఆర్డీవోను, తహశీల్దార్‌ను జేసీ ఆదేశించారు. అయితే సీతయ్య మరణించడంతో అతని కుమారుడు అధికారులను వివిధ రకాల కారణాలతో బెదిరించి నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూములు కూడా మావే అని, మీకు ఎవరు ఇచ్చారంటూ తాము సాగు చేసుకుంటున్న భూముల్లోకి రాకుండా అడ్డు పడుతూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన భూమి స్వాధీనం చేసుకున్నారని, ఈ విషయం పై అనేక సార్లు స్పందనకు కూడా వచ్చి అధికారులకు తెలియచేసినా పట్టించుకోకపోవడంతో నిరసన తెలపాల్సి వచ్చిందని వాపోయారు. ఆమేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. తహశీల్దార్ దాసు స్పందిస్తూ అధికారులకు విషయం తెలియచేసి విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

దర్జాగా..దర్జీలు

- దర్జీలకు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం
- జగనన్న చేదోడు పథకం టైలర్లకు వరం



జగనన్న చేదోడు పథకం లోగో

రాచర్ల: ఐదేళ్ల చంద్రబాబునాయుడు పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ఏ ఒక్క సామాజిక వర్గానికీ న్యాయం జరగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో అన్న వస్తున్నాడు.. అన్న వస్తున్నాడు.. మంచి రోజులు వస్తున్నాయన్న భరోసా కల్పించడమే కాకుండా ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ ప్రజా సంకల్పయాత్ర చేసుకుంటూ రాష్ట్రంలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలకు తొలి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు. కుల వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న దర్జీలు, నాయీబ్రాహ్మణులు, రజకులు, ఆటో డ్రైవర్లు, చేనేతను నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలకు ఆశాజనకమైన కేటాయింపులు చేశారు. ఏటా వారి సంక్షేమానికి ప్రభుత్వ పరంగా రూ.10 వేల ఆర్థిక సాయం చేసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ.. ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

దర్జీల కుటుంబాల్లో ఆనందం

ప్రస్తుతం ప్యాషన్ రంగం విస్తరణ, రెడీమేడ్ షోరూంల ఏర్పాటుతో టైలర్లు ఆర్థికాభివృద్ధి లేక ఇబ్బందులు పడుతున్నారు. వారి జీవితాల్లో చీకట్లు కమ్ముకుంటూనే ఉన్నాయి. కుల వృత్తిపై కుటుంబ పోషణ భారం కావడంతో టైలర్లు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఏళ్ల తరబడి తమ హక్కుల కోసం ప్రభుత్వ ఆదరణ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే రెండు నెలల్లోనే తమ సంక్షేమం కోసం కృషి చేసి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు దర్జీల కోసం కేటాయించడంతో తమ బతుకులు దర్జాగా ఉన్నాయని టైలర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. షాపులు ఉన్న దర్జీలకు ఏటా రూ.10 వేలు చొప్పున



టైలరింగ్ షాపులో దుస్తులు కుడుతున్న దర్జీలు

అందిస్తున్న సాయంతో కలిపి ఇప్పటికే ఒక్కొక్కరికి రూ.30 వేల ఆర్థిక సాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని గిద్దలూరు పట్టణంతో పాటు రాచర్ల, బేస్తవారిపేట, కంభం, అర్థవీడు, కొమరోలు మండలాల్లోని గ్రామాల్లో అత్యధిక కుటుంబాలు టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో పురుషులతో పాటు మహిళలు, యువత ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

పెద్దారవీడు: మండలంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదం, గుండెపోటుతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం పరామర్శించారు. తంగిరాలపల్లె గ్రామం సచివాలయ కన్వీనర్ పిన్నెబోయిన ఈశ్వరయ్య గుండెపోటుతో, వినుకొండ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్లవరం గ్రామం కోటగొట్ల వెంకటేశ్వరరెడ్డి, దుగ్గెంపూడి వెంకటేశ్వరరెడ్డి, గుండెపోటుతో మృతిచెందిన రామాయపాలెం సర్పంచ్ పాందుగుల వెంకటరెడ్డి తమ్ముడి భార్య, బద్వీడుచెర్లోపల్లె గ్రామంలో బీరెడ్డి పెద్ద అల్లూరిరెడ్డి, చిన్న అల్లూరిరెడ్డి చిత్రపటాలకు మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి చెర్లోపల్లె గ్రామంలో రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిన గృహసారథి మూల లక్ష్మీనారాయణరెడ్డిని పరామర్శించారు. వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల



వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచులు తోకల మల్లేశ్వరి, ఆదాము, ఆదినారాయణ, రామాంజనేయరెడ్డి, నాయకులు బలుసుపాటి నాగరాజు, వెన్నా శివకృష్ణారెడ్డి, దుగ్గెంపుడి కొండారెడ్డి, పెద్దకాశయ్య, రాజారావు, ఒద్దుల లక్ష్మిరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి, తోకల ఆవులయ్య, మూల జగదీశ్వరరెడ్డి, సుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, తదితరులు ఉన్నారు.

గృహసారథి మృతి

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, గృహసారథి బి.నర్సిరెడ్డి అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందగా సోమవారం ఉదయం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ పెద్ద మస్తాన్, నాయకులు కోటిరెడ్డి, మల్లారెడ్డి, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఇంద్ర ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

సంక్షేమ పథకాలపై అవగాహన పెంచాలి

ముండ్లమూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎంపీడీఓ కుసుమకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో సోమవారం సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ పరిధిలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలు సకాలంలో సాధించాలన్నారు. ప్రధానంగా ఆయుష్మాన్ భారత్, జగనన్న పాలవెల్లువ, ఏపీ మీసేవా సర్వీసులుపై సమీక్షించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సూపరింటెండెంట్ రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ కరుణాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పొదిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సచివాలయల కన్వీనర్లు, వార్డు కమిటీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేసి పోటీలో నిలిపారని పేర్కొన్నారు. మార్చి 13వ తేదీన ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యం ఓటు వీరిద్దరికీ వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు ఓటరు జాబితా, కరపత్రాలు అందజేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్‌బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, యర్రం వెంకటరెడ్డి, గూడూరి వినోద్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లాపురం నరసింహులు, ఫిరోజ్, ముల్లా జాకీర్, కంకణాల రమేష్, తల్లపు వెంకట నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

- పోలీసులకు ఎమ్మెల్యే కేపీ సూచన

మార్కాపురం: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సీఐ భీమానాయక్, ఎస్‌ఐ శశికుమార్‌తో కలిసి కోర్టు సెంటర్, కంభం సెంటర్, పాత బస్టాండ్, దోర్నాల సెంటర్‌లో పర్యటించారు. కోర్టు సెంటర్‌లో నూతనంగా వైద్యశాల ఏర్పాటు చేసినందున గతంలోలా ఒంగోలు నుంచి వచ్చే బస్సులు అక్కడ ఆపితే ఇబ్బందులు పడతారని, కొద్దిగా ముందు ఆపాలని సూచించారు. పాత బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహం మలుపు వద్ద ఒక పక్కగా బస్సులు ఆపితే బాగుంటుందని సూచించారు. పూలకోట్ల వద్ద బస్సులు ఆపటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. దోర్నాల సెంటర్‌లో వినుకొండ, మాచర్ల, యర్రగొండపాలెం ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఆపడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలన్నీ ఆగిపోతున్నాయని, కాస్తా ముందుకు తీసుకెళ్లి బసులు ఆపితే ప్రయాణికులు ఎక్కేందుకు బాగుంటుందని సూచించారు. వీటిని త్వరగా అమలు చేస్తామని సీఐ భీమానాయక్ చెప్పారు. ట్రాఫిక్‌పై ప్రజలను అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సూచించారు.



సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

సర్వసభ్య సమావేశం వాయిదా

రాచర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో కె.కవితా చౌదరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైస్ ఎంపీపీ ఈదుల సుజాత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు హాజరు కాగానే ఎంపీడీవో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు పగడాల దేవి, తహసీల్దార్ ఎం.దిలీఫ్‌కుమార్ హాజరయ్యారు.

కమనీయం..సీతారాముల కల్యాణం!



కల్యాణోత్సవానికి హాజరైన వెన్నా దంపతులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ దేవాలయంలో 60వ సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా అర్చకులు రఘునాథాచార్యుల బృందం నిర్వహించింది. ఉదయం 10 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై సీతారాములను ప్రతిష్ఠించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణానికి ఉభయదాతలుగా ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర దంపతులు, డి.పిచ్చిరెడ్డి, కె.ఆదిరెడ్డి, చెన్నారెడ్డి, ఎస్.పెద్ద యోగిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డి, ఎస్.యోగిరెడ్డి పర్యవేక్షించారు.

నేడు రథోత్సవం

సప్తాహ మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆమలక లక్ష్మీనారాయణ స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు రథోత్సవంలో స్వామి వారిని తిలకించి దర్శించుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నేతపాలెం వాసులు



చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న నేతపాలెం వాసులు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని నేతపాలెం వాసులు సోమవారం విజయవాడలో ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను కలిశారు. శాలువాతో ఆయన్ను సత్కరించారు. చిన్న బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించేలా చూడాలని కోరారు. శ్మశానం బాట, వడ్డే రమేష్ ఇంటి పక్క నుంచి ఒంగోలు రోడ్డు వరకు ఉన్న దారి సమస్య పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. చైర్మన్‌ను కలిసిన వారిలో ధర్నాసి పెద్దన్న, ఆరిక రాము, దాసరి రవిచంద్ర, ఇనగంటి రాజశేఖర్, బద్దిపూడి హజరత్ ఉన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈవో శామ్యూల్‌జాన్ సోమవారం తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల రికార్డులు, పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీలించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వసతులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంఈవో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్వాణి ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన మేడికొండ నారాయణస్వామిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ముండ్లమూరు గ్రామానికి చెందిన జెడ్పీటీసీ తాతపూడి మోజెస్ రత్నరాజుపై ఈ నెల 23వ తేదీన రాజకీయ కక్షల నేపథ్యంలో మేడికొండ నారాయణస్వామి, అతని భార్య అనూరాధలు దాడి చేసి కులం పేరుతో దూషించారు. రత్నరాజు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మార్కాపురం: విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ సుమన్, సెబ్ ఎస్‌ఐ పద్మజ సూచించారు. ఎంపీజే ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని కమల కాన్సెప్ట్ స్కూల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు జరిగింది. డ్రగ్స్ వాడి విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఉజ్వల భవిష్యత్తు పాడైపోతుందని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. ఎంపీజే ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ తమ బాధ్యతగా డ్రగ్స్ వాడితే కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కరెస్పాండెంట్ పి. పవన్‌కుమార్, ఎంపీజే నాయకుడు రసూల్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మార్కాపురం: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ఐ.బాలసుబ్బారావు అన్నారు. మార్కాపురం ప్రాంత విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. బాలసుబ్బారావును, కార్యదర్శిగా పి.జయరావు, కోశాధికారిగా ఐ.లక్ష్మీనాగేశ్వర్‌రావును ఎన్నుకున్నట్లు అసోసియేట్ అధ్యక్షులు వై.బాలశంకర్‌రావు, పాలెం చెంచయ్య తెలిపారు. ఉపాధ్యక్షులు జీవీ నారాయణరెడ్డి, ఎం.రామిరెడ్డి, కె.అల్లూరయ్య, ఎన్.బసిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా జి.రామచంద్రారెడ్డి, సర్దార్ అహ్మద్, బాల ఈశ్వరయ్య, ఎం.రమణయ్యలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా సూరె వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

తాళ్లూరు: చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోందని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. శివరామపురంలో సాగు చేస్తున్న చిరుధాన్యాలను సోమవారం ఆయన పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగును పెంచే దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి సోమవారం రైతు భరోసా కేంద్రాల్లో 'మండే మిల్లెట్స్‌డే' గా తీర్మానించి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

తరగతికి తగిన సామర్థ్యాలు పెంపొందించాలి

త్రిపురాంతకం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో తరగతికి తగిన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ కె తులసి మల్లికార్జుననాయక్ పేర్కొన్నారు. త్రిపురాంతకం కొత్త ముడివేముల పాఠశాలను ఎంఈఓ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను గణితం, ఇంగ్లిష్, తెలుగు నైపుణ్యాలు పెంపొందించాలన్నారు. మెనూ ప్రకారం మంచి భోజనం అందించాలని సూచించారు. నాడు-నేడు పనులు నాణ్యతగా పూర్తిచేయాలని మల్లికార్జుననాయక్ ఆదేశించారు. సీఆర్‌పీ ఏడుకొండలు ఆయన వెంట ఉన్నారు.

షాపుల్లో ఎరువుల ధరల బోర్డు తప్పనిసరి

పెద్దారవీడు: ఎరువుల షాపుల్లో వాటి ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు డి. బాలాజీనాయక్ అన్నారు. మండలంలో హనుమాన్ జంక్షన్‌కుంటలో ఎరువుల దుకాణాలు, రికార్డులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ శివశంకర్ ఆగ్రో ఏజన్సీస్ ఎరువుల గోడౌన్ పరిశీలించగా ప్రభుత్వం అనుమతి లేకుండా రూ.1,07,600 విలువైన ఎరువులను నిల్వ ఉంచారని, వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టెన్నిస్ టోర్నమెంట్‌లో డాక్టర్ మోహన్‌రెడ్డి సత్తా

గిద్దలూరు రూరల్: అంతర్ జిల్లా స్థాయి ఇన్విటేషన్ లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరుకు చెందిన జిల్లా లాన్ టెన్నిస్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డి ఫైనల్‌కు చేరడమే కాకుండా రన్నర్స్ ట్రోఫీ సాధించారు. నరసరావుపేటలో 55 ఏళ్ల విభాగం వారికి నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్‌లో మోహన్‌రెడ్డి, శివారెడ్డిలు గుంటూరు జిల్లాకు చెందిన శ్రీనివాస్, శివ క్రీడాకారులతో ఆడి విజేతలుగా నిలవడమే కాకుండా రన్నర్స్ ట్రోఫీ సాధించారు. వారిని గిద్దలూరు లాన్ టెన్నిస్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డితో పాటు పలువురు ప్రశంసించారు.



రన్నర్ ట్రోఫీ సాధించిన డాక్టర్ మోహన్‌రెడ్డి

వెంకటాపురంలో ముగిసిన పెద్దమ్మ జాతర

దొనకొండ: మండలంలోని వెంకటాపురంలో గ్రామస్తులు 2 రోజుల నుంచి మూకుమ్మడిగా కులాలకు అతీతంగా జరుపుకున్న పెద్దమ్మ జాతర సోమవారంతో ముగిసింది. గ్రామస్తులు మూకుమ్మడిగా భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం సమర్పించారు. పిల్లలు, పాపలు క్షేమంగా ఉండాలని, పాడి పంటలు సస్యశ్యామలంగా పండాలని, గ్రామానికి మేలు కలగాలని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి పెద్దమ్మ తల్లికి కుటుంబ సమేతంగా పొంగళ్లు సమర్పించారు.

మూఢనమ్మకాలను విడనాడాలి

దర్శి: మూఢనమ్మకాలను విడనాడి సైన్స్‌పై అవగాహన కల్పించుకోవాలని డాక్టర్ ఝాన్సీ కోటిరెడ్డి సూచించారు. డీఎస్పీ కార్యాలయం ఎదుట ఝాన్సీ నర్సింగ్ హోమ్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా బ్లడ్ పరీక్షలు చేసి గ్రూపు రిపోర్టులు ఇచ్చారు. ప్రథమ చికిత్స విధానాలు, సీపీఆర్ విధానంలో జాగ్రత్తల గురించి అవగాహన కలిపించారు. సమాజంలో స్త్రీ ప్రాధాన్యం, ఆరోగ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పించి అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రదర్శనలు చేశారు. ప్రదర్శనను ప్రారంభించి ఝాన్సీ కోటిరెడ్డిలు మాట్లాడుతూ మనతోటి వారు కూడా ఆరోగ్యంగా ఉండేందుకు సమాజంలో అందరం నైతిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. సాయి నర్సింగ్ హోమ్ బాధ్యులు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ ఝాన్సీ, అపుస్మా అసోసియేషన్ నేతలు రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం: ఒంగోలు సమీపంలోని పేర్నమిట్టలో ఆదివారం జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్‌లో మార్కాపురం ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు 15 బంగారు పతకాలు, 16 వెండి పతకాలు, 14 బ్రాంజ్ మెడల్స్‌తో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్ సాధించారని చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోచ్ తోట ప్రసాద్ తెలిపారు. విజేతలకు ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు బహుమతులు, ప్రశంసపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

మార్కాపురం టౌన్: తమ కళాశాలలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా పొందిన డాక్టర్ రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు, ఇందిరా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. కందుల రాజశేఖర్‌రెడ్డి జేఎన్‌టీ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్న సందర్భంగా సోమవారం కళాశాలలో ఆయన్ను హనుమారెడ్డితో పాటు తర్లుపాడు జెడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిరా సన్మానించారు.



రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న హనుమారెడ్డి, ఇందిర

రాజశేఖర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయరాంరెడ్డి, బీఎస్సీ నర్సింగ్ ప్రిన్సిపాల్ తులసి, డిప్లొమా ఇన్‌చార్జి అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

మస్తాన్‌వలికి వివేకానంద జాతీయ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న మస్తాన్‌వలి

పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నాయకులు, ఎంబీసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్, నానీ సేవాదళ్ నిర్వాహకులు రాములేటి మస్తాన్‌వలికి వివేకానంద జాతీయ సేవా అవార్డు వచ్చింది. విజయవాడలోని పడమట పంట కాలువ రోడ్డులోని కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఆకుమళ్ల నానీ చేతుల మీదుగా మస్తాన్‌వలిని శాలువాతో సత్కరించి అవార్డును అందజేశారు. మూడేళ్లుగా మస్తాన్‌వలి దంపతులు చేస్తున్న సేవలు కొనియాడారు. బాదుల్లా, వెంకటరావు, చైతన్య ప్రసాద్, గోపి, షేక్ హఫీషా పాల్గొన్నారు.